## పోస్టల్ ఓటుకు 31 వేల దరఖాస్తులు

హైదరాబాద్, నవంబర్ 11 ( నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ ఓటు కోసం 31,551 మంది దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం 80 ఏండ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసే వెసులుబాటు కల్పించింది. 13 అత్యవసర సేవల ఉద్యోగులకూ పోస్టల్ ఓటు సౌకర్యం కల్పించారు. దీని కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 8 వరకు అధికారులు అవకాశం కల్పించారు. రాష్ట్రంలో దివ్యాంగులు 5.06 లక్షలు, 80 ఏండ్లు పైబడిన వారు 4.43 లక్షల మంది, వందేండ్లు పైబడిన వారు 7,689 మంది ఉన్నారు. పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో చాలా తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని అంచనా వేస్తున్నారు.

### పోలింగ్ రోజుకు ముందే పోస్టల్ ఓట్లు

పోస్టల్ ఓటుకోసం దరఖాస్తు చేసుకున్న వారికి పోలింగ్ తేదీకి ముందుగానే ఓటేసే అవకాశం కల్పిస్తారు. వారి ఓటింగ్ తేదీలను స్థానికంగా ఉండే రిటర్నింగ్ అధికారి నిర్ణయిస్తారు. రూట్ల వారీగా ఉండే పోలింగ్ అధికారుల బృందం ఓటింగ్ ప్రక్రియను చేపడతారు. ఈ ప్రక్రియను మొత్తం వీడియోలో చిత్రీకరిస్తారు. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఓట్లను బ్యాలెట్ బాక్స్‌ల్లో ఉంచి, మొత్తం పోలింగ్ పూర్తయ్యాక స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారు. ఓట్ల లెక్కింపు రోజున మొదట ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లనే లెక్కిస్తారు. ఆ తర్వాత ఈవీఎం ఓట్లను లెక్కిస్తారు.

**పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఓటర్లు**

| | |
|---|---|
| 80 ఏండ్లు పైబడిన వారు | 17,811 |
| దివ్యాంగులు | 11,327 |
| అత్యవసర సేవల ఉద్యోగులు | 2,413 |
| మొత్తం | 31,551 |

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో పార్టీ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీనేత దాసోజు శ్రవణ్ తదితరులు

# కరెంట్ కావాలా? కాంగ్రెస్ కావాలా?

- కాంగ్రెస్ అంటే కరెంటు కోతలు
- బీఆర్ఎస్ అంటే పంటల కోతలు
- రైతును రాజు చేసిందే సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ డిక్లరేషన్లు చిత్తు కాగితాలు
- రైతులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## రాబందు కాంగ్రెస్.. రైతుబంధు బీఆర్ఎస్

> రైతులను అన్యాయంగా అరిగోసపెట్టిన రాబందు పార్టీ కాంగ్రెస్ అయితే రైతుబంధు తెచ్చిన ఘనత బీఆర్ఎస్‌ది.కాలంతో పోటీపడుతూ సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది. 24 గంటల ఫ్రీ కరెంట్ అందిస్తున్నది బీఆర్ఎస్సే. ఉచిత విద్యుత్తు కోసం నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున ఖర్చు చేసిన రాష్ట్రం తెలంగాణ తప్ప మరోటి ఉన్నదా?
> - కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): కరెంట్ కావాలా? కాంగ్రెస్ కావాలా? ఆలోచించాలని ప్రజలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కోరారు. కరెంట్ విషయంలో రైతులను సమిధలు చేయటమే కాంగ్రెస్ విధానమని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ అంటే పంట కోతలు, కాంగ్రెస్ అంటే కరెంట్ కోతలు అని పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నేత దాసోజు శ్రవణ్ తదితరులతో కలిసి మంత్రి మాట్లాడారు. కరెంట్ విషయంలో రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రైతులకు 3 గంటలు చాలన్న దానిపై తక్షణమే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు విషయంలో కాంగ్రెస్‌కు ఒక విధానమంటూ లేదని ఎద్దేవా చేశారు. కరెంట్ విషయంలో రాహుల్ గాంధీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు కరెంట్ వద్దన్న కాంగ్రెస్‌ను ఊరి పొలిమేరల దాకా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

### అమెరికాలో చెప్పింది తొందరపాటు అనుకున్నాం

అమెరికాలో రేవంత్ తొందరపాటున రైతులకు 3 గంటల కరెంటే చాలని చెప్పి ఉంటారని అనుకున్నామని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర రైతులపై అవగాహనలేమిని, దుర్మార్గమైన వైఖరిని కుండబద్దలు కొట్టినట్టు మరోసారి రేవంత్‌రెడ్డి వెల్లడించారని కేటీఆర్ మండిపడ్డారు. ఇప్పుడిప్పుడే దరికి వస్తున్న రైతన్నలను కాంగ్రెస్ మరింత ఆందోళనకు గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హస్తం పార్టీ నిజస్వరూపాన్ని గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రైతుబంధుపై 70 లక్షల మంది రైతులను భిక్షగాళ్లతో పోల్చిన రేవంత్‌రెడ్డి తక్షణమే రైతులోకానికి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో వ్యవసాయదారులకు క్రాప్ హాలీడేలు, పరిశ్రమలకు పవర్ హాలీడేలేనని అన్నారు. ఆ పార్టీ కరెంట్ విధానంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అమెరికా పర్యటన నుంచి పదే పదే బరితెగించి బాహాటంగా అదే వైఖరిని రేవంత్‌రెడ్డి ప్రకటిస్తున్నారని ఉదహరించారు.

### మెడ మీద మోదీ కత్తిపెట్టినా!

తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు రైతుల మోటర్లకు మీటర్లు పెట్టేందుకు ఒప్పుకునేది లేదని తెగేసి చెప్పింది సీఎం కేసీఆర్ అని కేటీఆర్ గుర్తుచేశారు. రైతుల కోసం 30 వేల కోట్లు వదులుకున్నాం కానీ, మోటర్లకు మీటర్లు పెట్టడానికి ఒప్పుకోలేదని చెప్పారు. రైతుబంధును కాపీ కొట్టి కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని తెచ్చిందని, అలాగే 11 రాష్ట్రాలు రైతుబంధును పోలిన పథకాన్ని తెచ్చే అని వార్య పరిస్థితిని కల్పించిన ఘనత, చరిత్ర బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వందల కేసులేసి ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూసినా, పెండింగ్ ప్రాజెక్టులు రన్నింగ్ ప్రాజెక్టులు అయ్యాయని, కాళేశ్వరం పూర్తిచేసి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తిచేయబోతున్నామని చెప్పారు. రైతులను అవమానపర్చిన కాంగ్రెస్‌ను ఊరూరా నిలదీయాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ఓడిపోతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేస్తున్న డిక్లరేషన్లు చిత్తుకాగితాలతో సమానమని కొట్టిపారేశారు. కుటుంబసభ్యులకు టికెట్లు ఇవ్వకూడదని ఉదయ్‌పూర్‌లో చేసిన డిక్లరేషన్ ఉదయించకుండానే అస్తమింపజేసింది కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు.

## లోకం పోకడ

## 544 కోట్లు స్వాధీనం

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్టోబర్ 9 నుంచి నవంబర్ 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.544.27 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నుంచి శనివారం వరకు రూ.6.04 కోట్ల విలువైన మద్యం, డబ్బులు, బంగారు ఆభరణాలు, డ్రగ్స్, ఇతర ఉచితాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు రూ.186.82 కోట్ల నగదు, రూ.77.84 కోట్ల విలువైన మద్యం, రూ.31.99 కోట్ల విలువైన మత్తు పదార్థాలు, రూ.178.61 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.68.99 కోట్ల విలువైన ఉచితాలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు రూ.3.55 కోట్ల నగదును సీజ్ చేసినట్టు ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 36.8°c | 21.0°c |
| రంగారెడ్డి | 35.7°c | 15.7°c |
| మెదక్ | 34.8°c | 17.2°c |
| ఆదిలాబాద్ | 34.7°c | 17.6°c |
| కరీంనగర్ | 33.0°c | 21.0°c |
| ఖమ్మం | 33.0°c | 21.0°c |
| నిజామాబాద్ | 32.7°c | 21.3°c |
| హైదరాబాద్ | 32.2°c | 20.4°c |
| వరంగల్ | 32.0°c | 21.0°c |
| మహబూబ్‌నగర్ | 31.9°c | 21.0°c |

# బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నాయకత్వంలో అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి జడ్పీటీసీ సభ్యురాలు, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సున్నం నాగమణి, సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నేత కొండూరి సుధాకర్, ఇల్లెందు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు బండి సత్యనారాయణ బీఆర్ఎస్‌లో చేరారు.

### భద్రాచలం డివిజన్ నేతల చేరిక

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, భద్రాచలం డివిజన్ సీనియర్ నేత రావులపాటి రాంప్రసాద్, వెంకటాపురం ఎంపీపీ సతీశ్, సీపీఐ మండల కార్యదర్శి సునీల్‌తోపాటు పలువురు సీపీఐ డివిజన్ నాయకులు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తెల్లం వెంకటరావు విజయానికి కృషి చేయాలని కేటీఆర్ కోరారు.



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, టీడీపీ సీనియర్ నాయకులతో మంత్రి కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

మంత్రి కేటీఆర్‌కు రూ.లక్ష అందజేస్తున్న శంకరమ్మ. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

## బీఆర్ఎస్ ఎన్నికల ఖర్చుకు విరాళం

- రూ.లక్ష అందజేసిన శంకరమ్మ

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార ఖర్చు కోసం అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ రూ.లక్షను అందజేశారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు చెక్కు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఈసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శంకరమ్మను మరింత గౌరవప్రదమైన స్థానంలో నిలిపే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం త్యాగం చేసిన అమరవీరుల ఆశయాల సాధన కోసం బీఆర్ఎస్ మరోసారి గెలవాల్సిన అవసరం ఉన్నదని శంకరమ్మ చెప్పారు.

# బీసీలపై రేవంత్ నక్క వినయం

- బీసీ అభ్యర్థులు లేని జిల్లాలో డిక్లరేషనా?
- ఓడిపోయేచోట్ల బీసీలకు సీట్లిస్తవా?
- దొంగ సర్వేలతో కొత్త వారికి టికెట్లా?
- కాంగ్రెస్ బీసీ పన్నాగంపై పొన్నాల ఫైర్
- మోసగాడు రేవంత్‌రెడ్డి: దాసోజు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో బీసీ బిడ్డలపట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏ ఒక్క నాయకుడికైనా ఉందా? అని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. తెలంగాణలో బీసీలను ఉద్ధరిస్తామని చెప్పున్న రేవంత్‌రెడ్డివి నక్క వినయాలు, దగాకోరు రాజకీయాలని పొన్నాల ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారంబీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రావణ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డితో కలిసిన పొన్నాల విలేకర్లతో మాట్లాడారు. '54శాతం ఉన్న బీసీ ప్రజల గురించి ఇప్పుడా మాట్లాడేది? బీసీ డిక్లరేషన్ ప్రకటించడానికి మొదట సూర్యాపేట, తర్వాత మిర్యాలగూడ, నల్లగొండ.. ఫైనల్‌గా షాద్‌నగర్ అనుకొని.. చివరికి బీసీ అభ్యర్థులు లేని కామారెడ్డిలో సభ పెట్టడం దేనికి సంకేతం? మీరా బీసీల చిత్తశుద్ధి గురించి మాట్లాడేది?' అంటూ మండిపడ్డారు. నిజామాబాద్‌లోని 9 నియోజకవర్గాల్లో ఒక్క బీసీ అభ్యర్థికి కూడా అవకాశం ఇవ్వకుండా.. అక్కడ బీసీ డిక్లరేషన్ చేయడం.. రేవంత్, కాంగ్రెస్‌పార్టీ మోసపూరిత బుద్ధికి నిదర్శనమని అన్నారు. బీసీ డిక్లరేషన్‌కు కమిటీ వేసి, దానికి అధ్యక్షుడిగా బీసీనీ పెట్టి.. క్యాంపెయిన్ కమిటీలో బీసీయేతరులను నియమించడం దారుణమైన మోసమని విమర్శించారు.

### బీసీలను నమ్మించి గొంతు కోసిండు

దొంగ సర్వేల పేరు చెప్పి రేవంత్‌రెడ్డి డబ్బుల కోసం సీట్లు అమ్ముకోవడం వల్ల బీసీ అభ్యర్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కల్పించారని పొన్నాల ఆరోపించారు. 'తెలంగాణలో 34 మంది బీసీలకు టికెట్లు ఇస్తామని చెప్పి.. కేవలం 23 ఇచ్చి, అందులో ఒకటి క్యాన్సిల్ చేసి, ఓడిపోయే ఐదుచోట్ల బీసీలకు టికెట్లు కేటాయిస్తవా? ఈ చొప్పున నువ్వు బీసీలకు ఇచ్చింది మొత్తం 17 సీట్లేగా రేవంత్‌రెడ్డి? ఇక ఏ ముఖం పెట్టుకొని బీసీ డిక్లరేషన్ అంటున్నావ్' అంటూ నిలదీశారు. 'మొత్తం దొంగ సర్వేల పేరుతో, డబ్బులు తీసుకొని సీట్లు ఇచ్చింది నువ్వు కాదా? 38 చోట్ల కొత్తవాళ్లకు ఏ సర్వేల పేరుతో టికెట్లు ఇచ్చావ్? అందులో ఐదురోజులు, మూడు రోజుల ముందు కూడా జాయిన్ అయిన వాళ్లు లేరా? అప్పుడవన్నీ దొంగ సర్వేలే కదా? ఇవన్నీ బీసీ బిడ్డలు గమనించి ఓటు వేయాలి' అని పొన్నాల పిలుపునిచ్చారు.

### ధైర్యం ఉంటే కేసీఆర్‌ను అధ్యయనం చేయాలి

బీఆర్ఎస్ పార్టీలో బీసీలకు సంపూర్ణ న్యాయం జరుగుతున్నది కాబట్టే తాను బీఆర్ఎస్ పార్టీలోకి వచ్చినట్లు పొన్నాల లక్ష్మయ్య చెప్పారు. సీఎం కేసీఆర్ 23 మంది బీసీలకు టికెట్లు ఇచ్చారని చెప్పారు. ఐదుగురు బీసీలకు రాజ్యసభ, 8 మందికి ఎమ్మెల్సీలు, 55 మందికి వివిధ కార్పొరేషన్ల పదవులు ఇచ్చి, దేశ, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారని పొన్నాల చెప్పారు. నక్క వినయాలు ప్రదర్శిస్తున్న రేవంత్‌రెడ్డి.. బీసీలకు సీఎం కేసీఆర్ చేస్తున్న మంచిని, చేస్తున్న ఖర్చును అధ్యయనం చేయాలని సవాల్ విసిరారు.

### హంతకుడే సభపెట్టినట్లుంది: దాసోజు

రేవంత్‌రెడ్డి సమక్షంలో బీసీ డిక్లరేషన్ చేయడం అంటే.. హంతకుడు సంతాసభ పెట్టినట్టు ఉందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రావణ్ అన్నారు. పొన్నాలతో సహా ఎందరినో నమ్మించి మోసం చేసిన మోసగాడు రేవంత్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ నాయకులను ఓర్వలేనోళ్లు.. బీసీలను ఉద్ధరించడమంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందన్నారు. 9 ఏండ్లుగా బహుజన బిడ్డలకు సీఎం కేసీఆర్ పెద్ద పీట వేశారని, 50వేల కోట్ల రూపాయలు కేవలం బీసీలకు ఖర్చు చేశారని చెప్పారు. కుల వృత్తులకు ప్రాణం పోసి, వారికి ఆత్మగౌరవ భవనాలు కట్టారని చెప్పారు. ఇప్పుడు రేవంత్ పల్లకి మోస్తున్న బీసీ నేతలు మరోసారి ఆలోచన చేయాలని అన్నారు. బీసీ వర్గానికి చెందిన ముగ్గురు పీసీసీ అధ్యక్షులు కాంగ్రెస్‌ను వదిలి బీఆర్ఎస్‌లోకి ఎందుకొచ్చారో ఆలోచన చేయాలన్నారు.

## కల్లు సొసైటీలపై దాడి వెనుక జాతీయ పార్టీలు

- గౌడ కులస్థులందరూ బీఆర్ఎస్ పార్టీ వెంట ఉన్నారనే అక్కసు
- గౌడలను కడుపులో పెట్టుకున్నాం
- పురపాలక శాఖ మంత్రి కేటీఆర్
- కల్లు సొసైటీలను కాపాడాలని మంత్రికి లక్ష్మణ్‌రావుగౌడ్ వినతి

మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): గౌడ కులస్థులంతా బీఆర్ఎస్ వెంట ఉన్నారనే అక్కసుతో హైదరాబాద్ కల్లు సొసైటీలపై కొన్ని జాతీయ పార్టీలు కుట్రతో దాడులు చేయించాయని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కే తారకరామారావు విమర్శించారు. హైదరాబాద్‌లోని కల్లు సొసైటీలను కాపాడాలని కోరుతూ మంత్రికి ప్రగతిభవన్‌లో శనివారం తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని 69 కల్లు సొసైటీలపై ఇటీవల జరిగిన నార్కోటిక్ అధికారుల దాడుల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేండ్లుగా గౌడ సామాజికవర్గాన్ని కడుపులో పెట్టుకొని చూశామని చెప్పారు. దాడులతో గౌడ సామాజికవర్గాన్ని భయపెట్టిస్తున్నారనే అనుమానం ఉన్నదని తెలిపారు. గౌడల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లు సొసైటీలను మూసివేస్తే వాటిని తెరిపించిన ఘనత తమదేనని తెలిపారు. రూ.20 కోట్ల రెంటల్స్ రద్దు చేశామని, హరితహారంలో భాగంగా 4 కోట్ల ఈత, తాటి మొక్కలను నాటించామని వివరించారు. నగరంలో నీరా కేఫ్ ఏర్పాటుతో గౌడ సోదరుల గౌరవం పెంచామని, మద్యం దుకాణాల్లో 15 శాతం రిజర్వేషన్లు కల్పించామని, గౌడ ఆత్మగౌరవ భవనం వంటి ఎన్నో పనులు చేశామని వివరించారు. గౌడలను భయభ్రాంతులతో బీఆర్ఎస్‌కు దూరం చేయాలని కొన్ని పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని ఈ సందర్భంగా పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

# తెలంగాణకు కేసీఆరే గ్యారెంటీ సీఎం

- మూర్ఖుడి చేతిలో కాంగ్రెస్ పార్టీ నిండా మునుగుడు ఖాయం
- రేవంత్ నోరును అదుపులో పెట్టుకోకపోతే పుట్టగతులుండవ్
- 25న హైదరాబాద్‌లో సీఎం భారీ సభ
- 17 నుంచి కేటీఆర్ రోడ్‌షోలు: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

శనివారం తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్ తదితరులు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ప్రజలు గాలి మాటలు నమ్మరని, గట్టిచేతలనే విశ్వసిస్తారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణకు కేసీఆరే గ్యారెంటీ సీఎం అని ప్రజలు స్పష్టమైన అవగాహన, నిర్ణయంతో ఉన్నారని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కేసీఆర్ మూడోసారి సీఎం కావడాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టంచేశారు. శనివారం తెలంగాణభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. మూర్ఖుడి చేతిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నిండా మునుగుడు ఖాయమని, రేవంత్‌రెడ్డి పిచ్చిమాటలకు ప్రజలు ఈసడించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ నేతల గాలి ప్రచారం, స్థాయిని మరిచి చేస్తున్న వ్యక్తగత ఆరోపణలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అని ప్రజలు నిశ్చింతంగా ఉన్నారని స్పష్టం చేశారు. రేవంత్ ప్రజలను రెచ్చగొట్టి 4 ఓట్లను రాబట్టుకోవటానికి పరుష పదజాలం వాడుతున్నారని మండిపడ్డారు. తమకు రేవంత్ కన్నా ఇంకా కిందిస్థాయి భాష వచ్చని, బాధ్యతగల స్థానాల్లో ఉన్నందున ఓపికపడుతున్నామని చెప్పారు. ఓపిక, సహనాన్ని చేతగానితనంగా చూడొద్దని హెచ్చరించారు. రేవంత్ అదే ధోరణిలో మాట్లాడితే వచ్చే నాలుగు ఓట్లు కూడా రావని హితవు పలికారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే కాంగ్రెస్‌కు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

### కేసీఆరే గ్యారెంటీ

ఇతర రాష్ట్రాల నేతలు వచ్చి కాంగ్రెస్ డిక్లరేషన్లు ప్రకటిస్తున్నారని, వాటికి ఎవరు బాధ్యత వహించాలని తలసాని ప్రశ్నించారు. తమను తాము గొప్పగా ఊహించుకొంటున్న కాంగ్రెస్, బీజేపీ బొక్కాబోర్లా పడటం ఖాయమని చెప్పారు. ఈటెల, రేవంత్ తమను తాము అతిగా ఊహించుకుంటున్నారని, వారికి ఓటమి తప్పదని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ మీద ఓడిపోవడం గౌరవంగా ఉంటుందని మాత్రమే వారు పోటీచేస్తున్నారని ఎద్దేవా చేశారు.

### 25న హైదరాబాద్‌లో కేసీఆర్ సభ

ఈ నెల 17 నుంచి మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లో రోడ్‌షోలు ఉంటాయని మంత్రి తలసాని చెప్పారు. 25న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. సభాస్థలి వివరాలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని అన్ని స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంటుందన్న ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### ఐఐటీలో..

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 17
- పోస్టులు: ఎస్ఈ, అసిస్టెంట్ లైబ్రేరియన్, అసిస్టెంట్ స్టాఫ్ నర్స్, మెడికల్ ఆఫీసర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 30
- వెబ్‌సైట్: https://iitgn.ac.in

### ఐటీబీపీలో..

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 6
- పోస్టులు: అసిస్టెంట్ కమాండెంట్ (ఇంజినీర్)
- పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు
- అర్హతలు, ఎంపిక వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 15
- వెబ్‌సైట్: www.itbppolice.nic.in

### ఇస్రోలో...

తిరువనంతపురంలోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) పరిధిలోని విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 18
- పోస్టులు: లైట్ వెహికల్ డ్రైవర్, హెవీ వెహికల్ డ్రైవర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 27
- వెబ్‌సైట్: https://www.vssc.gov.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జనరల్ సైన్స్, జాగ్రఫీ, జనరల్ స్టడీస్ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.